

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని ఉపాధి హామీ కార్మికులకు వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కవురు పెద్దిరాజు డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎంపిడిఒ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ ఉపాధి కార్మికులు చేసిన పనికి వేతన రాకపోవడం వల్ల అర్ధాకలితో అలమటిస్తున్నారన్నారు. మండలంలో ఉపాధి హామీ పని చేసిన ప్రతి కుటుంబానికీ ప్రభుత్వం నుండి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ బకాయిలు ఉన్నాయన్నారు. బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల కార్యదర్శి గుబ్బల నాగేశ్వరరావు, పిల్లి కామేశ్వరరావు, కవురు శ్రీనివాస్, జల్లి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

ఇ-క్రాప్‌పై.. స్పష్టత ఏదీ..!

ఖరీఫ్ సాగు ప్రారంభమైనా మొదలుకాని ఇ-క్రాప్ నమోదు

రెండు జిల్లాల్లో దాదాపు ఐదు లక్షల ఎకరాల్లో పంటల సాగు

పంట నష్టపరిహారం నుంచి బీమా వరకూ అన్నింటికీ ఇ-క్రాప్‌నే ఆధారం

కౌలురైతుల పేర్లు నమోదుపైనా స్పష్టతివ్వని ప్రభుత్వం

సాగు చేసే రైతులకు న్యాయం జరిగేనా..?



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ సాగు ఆరంభమై నెలలు గడిచిపోతున్నా రెండు జిల్లాల్లో ఇప్పటికీ ఇ-క్రాప్ నమోదు ప్రక్రియ ప్రారంభం కాని పరిస్థితి నెలకొంది. కొత్త ప్రభుత్వం ఇ-క్రాప్ నమోదుకు సంబంధించి ఎటువంటి స్పష్టతా ఇవ్వకపోవడం రైతుల్లో చర్చనీయాంశంగా మారింది. పంట రుణాల నుంచి దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం, బీమా, ధాన్యం విక్రయం వంటి అనేకం ఇ-క్రాప్ ఆధారంగానే జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇ-క్రాప్ నమోదుపై ప్రభుత్వం మౌనంగా ఉండటం గమనార్హం. ఖరీఫ్‌లో ఏలూరు జిల్లావ్యాప్తంగా 2.60 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. దీనిలో 2.20 లక్షల ఎకరాల్లో వరి, మిగిలింది మొక్కజొన్న, మినుము, పత్తి వంటి సాగు ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు 2.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతుండగా 2.15 లక్షల ఎకరాల్లో వరి, మిగిలినవి ఇతర పంటలు ఉన్నాయి. ఇ-క్రాప్ నమోదులో వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి ఆ భూమిలో ఏ పంట సాగు చేస్తున్నారో గుర్తించి, రైతు పేరుతో సహా ఇ-క్రాప్ సైట్‌లో నమోదు చేయాలి. దీని ఆధారంగానే బ్యాంకులు పంట రుణాల మంజూరు నుంచి ప్రభుత్వం రైతులకు అందించే ప్రతిసాయమూ వర్తిస్తోంది. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి నెలరోజులు గడిచింది. రెండు జిల్లాల్లోనూ ఖరీఫ్ నారుమడులు పూర్తయ్యి నాట్లు సాగుతున్నాయి. రెండు జిల్లాల్లో దాదాపు పది వేల ఎకరాల్లో నాట్లు సైతం పడ్డాయి. రైతులు పంట రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికీ ఇ-క్రాప్ నమోదు మాత్రం ప్రారంభం కాకపోవడంతో రైతులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఇ-క్రాప్ నమోదు జరగకపోతే పండిన పంటను సైతం విక్రయించలేని దుస్థితి రానుండటంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఇ-క్రాప్ నమోదుపై ఏలూరు జిల్లావ్యవసాయశాఖ జెడి హబీబ్‌భాషాను వివరణ కోరగా కొద్ది రోజుల్లోనే ప్రారంభమవుతుందని తెలిపారు.

కౌలురైతుల పేర్లు నమోదుపై స్పష్టత ఏది..?

నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో సాగు చేస్తున్న రైతుల పేర్లు, పంటల వివరాలను ఇ-క్రాప్‌లో నమోదు చేయాలి. గత ప్రభుత్వం దీన్ని పూర్తిగా తుంగలో తొక్కేసింది. సాగు చేస్తున్న కౌలురైతుల పేర్లు కాకుండా సాగు చేయని భూయజమానుల పేర్లు ఇ-క్రాప్‌లో నమోదు చేయించింది. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయికి వెళ్లకుండానే కార్యాలయాల్లోనే ఈ పని ముగించేశారనే విమర్శలు సైతం ఉన్నాయి. రెండు జిల్లాల్లో మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు ఉన్నారు. రెండు జిల్లాల వ్యవసాయ సాగులో 70 శాతానికిపైగా వీరే చేస్తున్నారు. సాగు చేస్తున్న కౌలు రైతులందరికీ కౌలుకార్డులు జారీ చేసి ఇ-క్రాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వంలో ఇది కొంతమేర సాగింది. వైసిపి ప్రభుత్వం వచ్చాక కౌలుచట్టంలో మార్పులు చేసి సాగుదారులను పూర్తిగా పక్కన పెట్టేసిన పరిస్థితి కొనసాగింది. దీంతో పండించిన పంటను సైతం కౌలుదారులు అమ్ముకోలేని దుస్థితి ఏర్పడింది. కొత్త ప్రభుత్వం రావడంతో కౌలురైతులకు న్యాయం చేస్తుందనే ఆశతో సాగుదారులు ఎదురుచూస్తున్నారు. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సాగు చేస్తున్న కౌలురైతుల పేర్లను ఇ-క్రాప్‌లో నమోదు చేయాలని రైతులు, రైతుసంఘాలు కోరుతున్నాయి. కౌలుకార్డుల జారీ ప్రక్రియ రెండు జిల్లాల్లోనూ మందకొడిగా సాగుతుండటంతో ఈ ప్రభుత్వం కూడా కౌలురైతులకు అన్యాయం చేస్తుందా అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇ-క్రాప్ నమోదులో కౌలురైతుల పేర్లు నమోదు చేసేలా ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాల్సి ఉంది. అంతేకాకుండా కౌలుచట్టంలో మార్పులు చేసి కౌలురైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సాగుదారులు కోరుతున్నారు. ప్రభుత్వం ఏవిధంగా ముందుకు సాగుతుందో వేచిచూడాలి.

కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించాలి

కలెక్టర్ నాగరాణి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

వివాహ వయస్సు, కుటుంబ నియంత్రణలపై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించడం ద్వారా జనాభా నియంత్రణ సాధ్యమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రపంచ జనాభా దినోత్సవం కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన బిడ్డల జననానికి కాన్పు కాన్పుకు మధ్య అంతరంతోపాటు, సరైన వయస్సులోనే వివాహం చేసుకోవాలన్నారు. జనాభా పెరుగుదలలో భారతదేశం అగ్రభాగాన నిలిచిందన్నారు. జనాభా పెరిగినంతగా జల వనరులు, భూమి, ఆహార ధాన్యాలు, ఇతర వనరులు పెరగలేదన్నారు. జనాభా పెరుగుదలతో సహజ వనరులపై ఒత్తిడి పడుతుందన్నారు. పరిశ్రమలు, ఇతర అభివృద్ధి రంగాలు శ్రమశక్తిలోనూ మన దేశ యువత భాగస్వామ్యం అధికంగా ఉందన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ భానునాయక్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ దేవ సుధ, జిల్లా గణాంక అధికారి ప్రసాద్, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, వైద్యులు, డిపిఎంఒ ధనలక్ష్మి, ఎఎన్ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జనాభా నియంత్రణకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని, ఆ దిశగా వైద్యఆరోగ్య అధికారులు కృషి చేయాలని డిఆర్‌ఒ జె.ఉదయ భాస్కరరావు అన్నారు. గురువారం వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు చేపట్టిన చైతన్య ర్యాలీని డిఆర్‌ఒ ఉదయ భాస్కరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మనదేశం ఒకటని అన్నారు. విపరీతంగా జనాభా పెరుగుదల వల్ల సహజ వనరులు అంతరించి అనర్థాలకు దారితీస్తుందన్నారు. సుస్థిర అభివృద్ధి, కుటుంబ నియంత్రణ, పేదరికంపై సాధారణ ప్రజలకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. మాతాశిశుశ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భధారణ, బిడ్డ బిడ్డకు మధ్య అంతరం ఉండేటట్లు అవగాహన కల్పించేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ డి.ఉమామహేశ్వరరావు, జిల్లా స్త్రీశిశు సంక్షేమ శాఖాధికారి బి.సుజాతరాణి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ డి.సుబ్బలక్ష్మి, జిల్లా గణాంక అధికారి ప్రసాద్, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, భీమవరం మదర్ నర్సింగ్ స్కూల్ స్టూడెంట్స్, వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు తెలుగు జాతి హక్కు

స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ఆపాలి

చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తమ వైఖరిని ప్రకటించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం



భీమవరంలో ఆందోళన చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - భీమవరం

విశాఖ ఉక్కు తెలుగుజాతి హక్కు అని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని తక్షణం ఆపాలని డిమాండ్ చేశారు. నరసాపురం ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ ప్రమాణస్వీకారం సమయంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ఆపుతామని చెప్పి ఇప్పుడు మోడీ నిర్ణయంపై ఆధారపడి ఉందని చెప్పడం అంటే అంతకుమించిన ద్రోహం మరొకటి లేదని విమర్శించారు. విశాఖ ఉక్కుపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ వైఖరిని ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక మెంటేవారితోటలోని సిపిఎం జిల్లా కార్యాలయం వద్ద బైపాస్ రోడ్డులో సిపిఎం ఆధ్వర్యంలో గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ కేంద్ర ఉక్కుభారీ పరిశ్రమల శాఖా మంత్రి కుమారస్వామి విశాఖపట్నంలోని స్టీల్‌ప్లాంటును సహాయ మంత్రి శ్రీనివాసవర్మతో కలిసి సందర్శించడం వెనుక ఆంతర్యమేమిటో తెలపాలన్నారు. స్టీల్‌ప్లాంటుని కాపాడటానికి వచ్చారా, లేక అమ్మేందుకు వచ్చారా అనేది ప్రజానీకానికి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. 32 మంది ప్రాణత్యాగ ఫలితం, 60 గ్రామాలకు చెందిన 20 వేలమంది రైతులు వేలాది ఎకరాలు భూమిని ఇచ్చి సాధించుకున్న ఫ్యాక్టరీ విశాఖ ఉక్కు అని అన్నారు. విశాఖ ఉక్కును కావాలని నష్టాల్లోకి నెట్టింది మీరు కాదా అని ప్రశ్నించారు. కోవిడ్ సమయంలో అనేక మందికి ఆక్సిజన్ ఇచ్చిన ఫ్యాక్టరీకి ఇప్పుడు ఊపిరి తీయాలని చూస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.వైకుంఠరావు, నేతలు మల్లిపూడి ఆంజనేయులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, అన్నెం రాంబాబు, కార్మికులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: విశాఖ ఉక్కు పరిరక్షణకు నిరంతర పోరాటాలు నిర్వహిస్తామని సిపిఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు అన్నారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను నిరసిస్తూ గురువారం ఆ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ ఐల్యాండ్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కర్రి నాగేశ్వరరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ 75 ఏళ్ల స్వాతంత్ర భారతంలో అభివృద్ధి చెందిన ప్రభుత్వరంగ సంస్థలను అంబానీ, అదానీలకు కట్టబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జవ్వాది శ్రీను, సత్తి కోదండ రామిరెడ్డి చిటికిన రాము, నరమాల కృష్ణ, మేతేటి రమణ, పులిమంతుల రమణ, కుంచంగి నానాజీ, గొర్రెల సతీష్‌కుమార్, పతివాడ నాగేంద్రబాబు పాల్గొన్నారు.


ఆకివీడులో..

ఆకివీడు: విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకం వెంటనే నిలుపుదల చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని నిరసిస్తూ గురువారం స్థానిక గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ రాష్ట్రంలో అతి ముఖ్యమైన కర్మగారాల్లో ప్రధానమైంది విశాఖ ఉక్కు కర్మాగారమని అన్నారు. ఇంతటి ప్రధాన రాష్ట్ర సంపదను అమ్మేస్తా అంటుంటే చేతులు ముడుచుకుని కూర్చోవాలా అని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో కె.తవిటినాయుడు, సందక ఉదయకుమారి, బి.రాంబాబు, బివి.వర్మ, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



తణుకులో..

తణుకు: కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రయివేటు పరం చేయడాన్ని తక్షణం ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.వి.ప్రతాప్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక వెంకటేశ్వర థియేటర్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మడం ఆపకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గార రంగారావు, కామన మునిస్వామి, బళ్ల చినవీరభద్రం, గుబ్బల గోపీ, పి.రాజా, కె.వీర్రాజు, వంశీ, శ్రీను, లక్ష్మణ్, వెంకటనారాయణ, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.


బకాయి వేతనాలివ్వాలని ఎస్ఎస్ఎ ఉద్యోగుల ఆందోళన


ఆచంటలో సమగ్ర శిక్ష కార్యాలయం వద్ద ప్ల కార్డులతో ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి - ఆచంట

సమగ్ర శిక్ష ప్రాజెక్టులో వివిధ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు మే, జూన్ నెలల పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు బి.కృష్ణ, బి.భరత్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద ఉద్యోగులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ రెండు నెలలుగా వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా యధావిధిగా వేతనాలొచ్చేలా ముందస్తు బడ్జెట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె సందర్భంగా చేసుకున్న ఒప్పందాల మేరకు వెంటనే సమ్మె కాలం జీవితం విడుదల చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలుకు కమిటీ ఏర్పాటు చేసి ఒప్పందాల అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని విభాగాలకు సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం మినిమమ్ టైమ్ స్కేల్ అమలుకు చర్యలు తీసుకోవాలని, త్వరలో విడుదల కానున్న డిఎస్‌సిలో అర్హులైన ఉద్యోగులకు వెయిటేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరిగిన నిత్యావసరాలకు అనుగుణంగా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, ఎస్ఎంపి.గణేష్, ఎన్.జాన్‌రత్నం, కుమారి, విజయలక్ష్మి, లక్ష్మీనారాయణ, గణపతి తదితరులు పాల్గొన్నారు.

అప్పారావుకు డాక్టరేట్‌పై పలువురి హర్షం


అప్పారావును అభినందిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా, గ్రామ, వార్డు సచివాలయాల అధికారి కెసిహెచ్.అప్పారావుకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ఆయనను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్థానిక కలెక్టరేట్లో గురువారం అభినందించారు. జిల్లా, గ్రామ, వార్డు సచివాలయాల అధికారిగా కెసిహెచ్.అప్పారావు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం నుండి 'డాక్టరేట్'ను ఈ నెల 9న అందుకున్నారు. 'తూర్పు గోదావరి జిల్లా వచన కవిత్వం-సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిశీలన' అనే సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించినందుకుగాను ఆయనకు ప్రొఫెసర్ డాక్టర్ ఎం.హరికృష్ణ పర్యవేక్షణలో ఈ పురస్కారాన్ని ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం ప్రకటించింది. అప్పారావును కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్‌ఆదిత్య, డిఆర్‌ఒ జె.ఉదయభాస్కరరావు, కలెక్టరేట్ ఉద్యోగులు, జిల్లా అధికారులు, జిఎస్‌డబ్ల్యుఎస్-మీకోసం కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

త్రిపుల్ ఐటిలో మెరిశారు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పెదతాడేపల్లిలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు త్రిపుల్ ఐటిలో ప్రవేశం పొందినట్లు పాఠశాల ప్రిన్సిపల్ బి.రాజారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదిలో 573 మార్కులు సాధించిన బర్రె ప్రకాష్ నూజివీడు త్రిపుల్ ఐటిలో, 575 మార్కులు సాధించిన టేకు కుమార్ శ్రీకాకుళం త్రిపుల్ ఐటిలో ప్రవేశాలు పొందినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఆయా విద్యార్థులను ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్, డిసిఒ ఎన్.భారతి, ఉపాధ్యాయులు అభినందించారు.


మేఘనా రమ్యశ్రీ


బర్రె ప్రకాష్

ఏకాగ్రత, చక్కని ప్రణాళికతో కృషిచేస్తే ఎంతటి ఉన్నత ఫలితాలనైనా సాధించొచ్చని వాణీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి ఉప్పు మేఘనా రమ్యశ్రీ నిరూపించిందని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయి అవార్డు గ్రహీత, స్కూల్ డైరెక్టర్ వాణి తెలిపారు. గురువారం రాజీవ్ గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ వారి (త్రిపుల్ ఐటి) ఒంగోలుకు జనరల్ కేటగిరిలో వాణి సీటు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్ అధినేత కె.కృష్ణ మాట్లాడారు. మేఘనా రమ్యశ్రీ జనరల్ కోటాలో సీటు సాధించడం గర్వకారణమన్నారు. ఈ విధంగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయ బృందానికి, మేఘన తల్లిదండ్రులకు స్కూలు యాజమాన్యం అభినందనలు తెలిపింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరవాసరం: రాయకుదురు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదిలో అత్యధిక మార్కులు సాధించిన నలుగురు విద్యార్థినులు త్రిపుల్ ఐటిలో సీట్లు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు కానుకొలను శ్రీనివాసరావు గురువారం తెలిపారు. వారిలో జక్కంశెట్టి రిబ్కా న్యూజివీడు, పంజా బాల శ్రీలక్ష్మి, కోడి అపర్ణ, కవురు తేజస్వి లహరికి ఒంగోలులో సీట్లు సాధించారు. వారిని పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ గుబ్బల సత్యనారాయణ, సర్పంచి గెడ్డం భారతి, ఎంపిటిసిలు అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, కడలి నెహ్రూ, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, జెడ్‌పిటిసి సభ్యులు గుండా జయప్రకాశ్ నాయుడు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లాలో 1.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు

ప్రజాశక్తి - నరసాపురం

జిల్లాలో గడిచిన 24 గంటల్లో గురువారం ఉదయం ఎనిమిది గంటల వరకూ నమోదైన వర్షపాతం వివరాలను అధికారులు వెల్లడించారు. అత్తిలిలో 12.6, పెంటపాడులో 6.6, తాడేపల్లిగూడెంలో 2.8, ఇరగవరంలో 1.6, తణుకులో 0.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తెలిపారు. జిల్లాలో మొత్తం 20 మండలాలకు గాను 24.4 మిల్లీమీటర్ల వర్షం నమోదైందని తెలిపారు. జిల్లా సగటు వర్షపాతం 1.2 మిల్లీ మీటర్లు నమోదైనట్లు చెప్పారు

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

తాడేపల్లిగూడెం: మండలంలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, అలాగే కొత్త రోడ్లు వేయాలని సిపిఎం మండల కమిటీ ప్రభుత్వాలను కోరింది. సిపిఎం మండల కమిటీ సమావేశం గురువారం ఇటుకులగుంట గ్రామంలో కండెల్లి సోమరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రోడ్ల అభివృద్ధి జరగలేదని, ఏ రోడ్డు చూసినా అధ్వానంగా ఉందని తెలిపారు. దీంతో ప్రజలు, వాహనదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. రోడ్ల అభివృద్ధికి ఎంఎల్ఎ చేస్తున్న కృషి అభినందనీయమని, తక్షణం మండలంలో ఉన్న అన్ని రోడ్లకూ మరమ్మతులు చేపట్టి, కొత్త రోడ్లు వేయాలని వారు కోరారు. అలాగే గ్రామాల్లో ఇంకా కొంతమంది ఇళ్ల స్థలాలు ఇల్లు కట్టుకునే వారు అర్హులు ఉన్నారని, అర్హులందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. సమావేశంలో మండల కమిటీ కన్వీనర్ పాలుపూరి సత్యనారాయణ, కమిటీ సభ్యులు పూరెల్ల సుబ్బారావు, సిద్ధాబత్తుల నాగేశ్వరరావు, పురిటిగడ్డ జయమ్మ పాల్గొన్నారు.

అల్లూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

డివివిఎస్ వర్మ




అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి - భీమవరం

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పిడిఎస్ఒ) నవయువ సమాఖ్య (ఎన్‌వైఎస్) ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు శత వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. జువ్వలపాలెం రోడ్డులో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో శత వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సభకు ప్రధాన వక్తగా దారి దీపం ప్రధాన సంపాదకులు డివివిఎస్ వర్మ విచ్చేసి పిడిఎస్ఒ రాష్ట్ర కమిటీ ప్రచురించిన 'అల్లూరి సీతారామరాజు శతవర్ధంతి విద్యార్థి ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అల్లూరి చనిపోయి వందేళ్ల అయినప్పటికీ ఆయన ఆశయాలు నేటికీ పూర్తి కాలేదన్నారు. దేశంలో ప్రజలు ప్రధానంగా గిరిజనులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ వీటిని ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థులు, యువతరం ఈ సమస్యల పరిష్కారానికై అల్లూరి స్ఫూర్తితో పోరాడాలన్నారు. పిడిఎస్ఒ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ మాట్లాడుతూ పరిశ్రమల కోసం, ప్రాజెక్టుల కోసం, ఆనకట్టల కోసం, గనుల తవ్వకం కోసం 1947 నుంచి 2004 వరకూ ఆరు కోట్ల మంది గిరిజన ప్రజలను నిర్వాసితులను చేశారన్నారు. అటవీ భూము లన్నింటినీ బడా కార్పొరేట్లకు, విదేశీ శక్తులకు లీజులకు ఇస్తున్నారని అన్నారు. అల్లూరికి నిజమైన వారసులుగా ఆయన పోరాట స్ఫూర్తిని అందుకొని గిరిజనులను, అటవీ సంపదలను కాపాడుకుని, అభివృద్ధి చేయాల్సిన బాధ్యత నేటి విద్యార్థి, యువతరంపై ఉందన్నారు. నవ యువ సమాఖ్య (ఎన్‌వైఎస్) రాష్ట్ర నాయకులు ఎన్.భాస్కర్ మాట్లాడుతూ 'బ్రిటీష్ వాళ్లపై అల్లూరి అవిశ్రాంతంగా పోరాడారన్నారు. పిడిఎస్ఒ రాష్ట్ర కోశాధికారి ఎల్.భాను మాట్లాడుతూ సమస్యల పరిష్కారం గురించి ఆలోచించకుండా పక్కదారి పట్టించడానికి దోపిడీ విష సంస్కృతిని వ్యాపింప చేస్తున్నారని దీనికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. సభానంతరం జువ్వలపాలెం రోడ్డులో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకూ భారీ ప్రదర్శన నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో 200 మంది విద్యార్థి, యువజనలు పాల్గొన్నారు.

సిపిఎఫ్ కార్మికులకు నష్టపరిహారం ఇవ్వాలి


ఎంఎల్ఎకు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నేతలు, కార్మికులు

ప్రజాశక్తి - గణపవరం

సరిపల్లి సిపిఎఫ్ కాంటాక్ట్ కార్మికులకు నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ గురువారం సిఐటియు ఆధ్వర్యాన ఉంగుటూరు శాసనసభ్యులు ధర్మరాజుకు ఆయన క్యాంపు కార్యాలయంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ధర్మరాజు మాట్లాడుతూ కార్మికుల సమస్య పరిష్కారానికి ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడతానని తెలిపారు. యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులకు నష్ట పరిహారం ఇచ్చామని అంటున్నారని, అయితే ఈ విషయం మరలా పరిశీలిస్తానని అన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్ మాట్లాడుతూ, కార్మికుల సమస్యను ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తామని తెలిపారు. సమస్యను ఆయనకు వివరిస్తామని చెప్పారు, ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు నారపల్లి రమణారావు, మండల కార్యదర్శి పి.గోవింద్, సిపిఎఫ్ ఫ్యాక్టరీ వర్కర్స్ యూనియన్ నాయకులు పి.ప్రకాష్, పిల్ల దుర్గ పాల్గొన్నారు.

వ్యాధులు వ్యాపించకుండా చర్యలు

ప్రజాశక్తి - ఆచంట

వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో వ్యాధులు వ్యాపించకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ పి.సింహాచలం ప్రసాద్ అన్నారు. గురువారం ఆయన పంచాయతీ కార్యాలయాన్ని, అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో డ్రైయినేజీ, తాగునీరు, పారిశుధ్యం తదితర సమస్యలపై దృష్టి పెట్టి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాల నేపథ్యంలో పారిశుధ్యంపై ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లాలని క్షేత్రస్థాయిలో తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై అశ్రద్ధ చేయొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్డి టి.మూర్తిబాబు, పంచాయతీ కార్యదర్శి జివి.నరసింహారావు పాల్గొన్నారు.

1400 ఎకరాల్లో నాట్లు పూర్తి : ఎఒ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండల పరిధిలో సుమారు 14 వందల ఎకరాల్లో సార్వాకు సంబంధించి వరినాట్లు జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారి ఎ.జ్యోషీలా తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలం మొత్తం ఆయకట్టు 12,206 ఎకరాలు కాగా ఇప్పటికే చాలా స్వల్పంగా నాట్లు జరుగుతున్నాయి. ప్రస్తుతం నాట్లు ఆలస్యమైతే దాళ్వా సీజన్ ఆలస్యమవుతుందని తెలిపారు. సకాలంలో సార్వా సీజన్ ప్రారంభించడం వల్ల అనుకున్న సమయానికి పంట చేతికి రావడమే కాకుండా, దిగుబడి బాగుంటుందని జ్యోషీలా తెలిపారు.

మానవతకు ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

వృత్తిరీత్యా విదేశాల్లో ఉన్నప్పటికీ స్వదేశంలో పేదల ఆరోగ్యం పట్ల మమకారంతో ఆక్సిజన్ కన్సంట్రేటర్ను ఎన్ఆర్ఐలు మానవత సంస్థకు బుధవారం బహూకరించారు. యలమంచిలి మండలానికి చెందిన తమ్మిడి మూర్తి, కృష్ణ కిషోర్ అమెరికాలో స్థిరపడ్డారు. వారి తల్లి లక్ష్మీ అంజలీదేవి యలమంచిలిలో నివాసం ఉంటున్నారు. కరోనా అనంతరం శ్వాస ఇబ్బందులతో ఎక్కువ మంది బాధపడడం గమనించిన వారు సుమారు 75 వేల రూపాయల విలువ గల ఆక్సిజన్ కన్సంట్రేటర్ను మానవతకు అందించారు. అనంతరం దాతలకు కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. కార్యక్రమంలో మానవత ప్రెసిడెంట్ ముత్యాల శ్రీనివాస్, సభ్యులు మేడికొండ రాంబాబు, బోళ్ల వీరాస్వామి పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి : ఎఒ

ప్రజాశక్తి - మొగల్తూరు

అన్నదాతలు యాజమాన్య పద్ధతులు పాటిస్తే సమయం, ఖర్చు ఆదావుతాయని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఈదా అనిల్కుమారి అన్నారు. మండలంలోని శేరేపాలెం, మొగల్తూరు గ్రామాల్లో అన్నదాతలు వేసిన నారుమడులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అన్నదాతలకు పలు సూచన చేశారు. ప్రస్తుత వాతావరణ కారణంగా నారుమడుల్లో తెగుళ్ల బారిన పడకుండానెం 45 (కార్బెండిజం)ను లీటర్ నీటిలో రెండు, మూడు గ్రాములు, పురుగు పట్టకుండా క్లోరిపైరిఫాస్ 20 శాతం ఇసి మందును లీటర్ నీటిలో మూడు మిల్లీలీటర్లు చొప్పున మందు పిచికారి చేయాలని సూచించారు. ఆమె వెంట వ్యవసాయ అధికారి ఎస్.అబ్దుల్ రహీమ్, పలువురు రైతులు ఉన్నారు.

జనాభా పెరుగుదలతో ఆహార కొరత

ప్రజాశక్తి - పాలకొల్లు

అధిక జనాభా పెరుగుదల వల్ల ఆహార కొరతతో పాటు, అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని జివిఎస్వి ఆర్ఎం మున్సిపల్ పాఠశాల హెచ్ఎం రాయప్రోలు భవానీ ప్రసాద్ తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జివిఎస్వి ఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడారు. పెరుగుతున్న జనాభా, తద్వారా తలెత్తే దుష్పరిణామాలను ప్రజలకు వివరించేందుకు ఏటా జులై 11వ తేదీన ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రపంచ జనాభా అధికారికంగా ప్రస్తుతం 8 బిలియన్లు దాటేసిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు త్రిమూర్తులు, చంద్రకళ, పాల్గొన్నారు.

మొగల్తూరు : ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఐసిడిఎస్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలు చేసిన సమావేశంలో సిడిపిఒ బి.ఉష్శ్రీ, డాక్టర్ కె.లక్ష్మీపార్వతి మాట్లాడారు. కుటుంబ నియంత్రణకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్రామంలో ప్రదర్శన చేశారు. అంగన్వాడీ, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకోడేరు : తల్లీబిడ్డల సంరక్షణ కోసం జాగ్రత్తలు పాటించాలని పాలకోడేరు పిహెచ్సి వైద్యాధికారి సిహెచ్ వి.రంగంనాయుడు తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని పిహెచ్సి సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రంగమ నాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో మరో వైద్యాధికారి స్వర్ణ నిరంజని, సిహెచ్ఒ.సత్యనారాయణ, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : లంకలకోడేరు పిహెచ్సి పరిధిలో లంకలకోడేరు రాజీవ్నగర్, లంకలకోడేరు మెయిన్ ఏరియాలో డాక్టర్ అడ్డల ప్రతాప్ కుమార్, డాక్టర్ నవ్య జీవన్ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సర్పంచి చొప్పల రజిని పాల్గొన్నారు. డాక్టర్ ప్రతాప్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో గుడాల హరిబాబు, పి.ఎలిజిబెత్ పాల్గొన్నారు.

నరసాపురం : వైఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల అకడమిక్ అడ్వయిజర్ ఆర్వి.సుబ్బారావు మాట్లాడారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ చింతపల్లి కనకారావు, డీన్ రామకృష్ణ పాల్గొన్నారు.

పాలకోడేరు : పాలకోడేరు పిహెచ్సి వైద్యాధికారి సిహెచ్ రంగంనాయుడుకు అవార్డు లభించింది. అత్యధిక ఆపరేషన్లు చేసినందుకు గానూ ఉత్తమ అవార్డును కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా అందుకున్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అవార్డు అందజేశారు. మొత్తం 150 ఆపరేషన్లు చేసినందుకు గానూ ఉన్నతాధికారులు ఆయన ప్రతిభను గుర్తించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ మహేశ్వరరావు, అడిషనల్ డిఎంఅండ్హెచ్ఒ భానునాయక్ ఉన్నారు.

తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - నరసాపురం

తహశీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ సందర్శించారు. ఆర్డిఒ అచ్యుత్ అంబరీష్తో కలిసి కార్యాలయాన్ని సందర్శించిన ఆయన కార్యాలయ సిబ్బందితో మాట్లాడారు. ప్రజలకు సేవలందించడంలో రెవెన్యూ వ్యవస్థ కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసాద్తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిశీలన

నరసాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గురువారం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ పరిశీలించారు. రిజిస్ట్రేషన్ శాఖ పనితీరుపై ఆరా తీశారు. కార్యాలయంలో కంప్యూటర్ రూమ్, రికార్డ్ రూమ్ను పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన భవనం వల్ల, వర్షాల వల్ల సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని లేఖర్లు ఎంఎల్ఎ దృష్టికి తెచ్చారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

చర్చి నిర్మాణానికి సిమెంట్ బస్తాలు అందజేత

పాలకొల్లు రూరల్:పాలకొల్లు రూరల్ గ్రామ పంచాయతీ పెదగరువులో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో చర్చి ప్లాస్టింగ్ పనులకు 25 సిమెంట్ బస్తాలను చర్చికి గురువారం అందజేశారు. చర్చి నిర్వాహకులు సిమెంట్ బస్తాలు ఇప్పించాలని మంత్రి నిమ్మల రామానాయుడును కోరగా ఆయన సానుకూలంగా స్పందించి ఫౌండేషన్ ద్వారా సమకూర్చారు. ఆయన తండ్రి పేరిట ఏర్పాటు చేసిన ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆపదలో ఉన్న వారిని సైతం ఆదుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, పార్టీ మండల ప్రెసిడెంట్ కోడి విజయభాస్కర్, పాముల రజనీకుమార్ పాల్గొన్నారు.

కళాశాలకు కంప్యూటర్ అందజేత

తణుకు:తణుకు మానవత సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఎస్ఎన్విటి జూనియర్ కళాశాలకు అమెరికన్ టెలిఫోన్, టెలి కమ్యూనికేషన్ సర్వీసెస్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్, హైదరాబాద్ వారిచే కంప్యూటర్ అందజేశారు. ఈ కంప్యూటర్ సిస్టంను తణుకు శాఖ అధ్యక్షురాలు కటారి శారదాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డి.శ్రీనివాసరావు మానవతకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా శాంతి ర్యాలీ కమిటీ ఛైర్మన్ గమిని రాంబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తణుకు శాఖ ఛైర్మెన్ బోయపాటి రామలక్ష్మి, కార్యదర్శి బొల్లం రామకాశి, ఆకుల శేషుబాబు, వంగూరి హనుమంతరావు, కాజా వాణి, పాతూరి శివన్నారాయణ పాల్గొన్నారు.

ప్రయివేటు దోపిడీ..!

టిసి ఇచ్చేందుకు రూ. వెయ్యి వసూలు
స్కూల్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థుల తండ్రి



స్కూల్ వద్ద పిల్లలతో ఆందోళన చేస్తున్న తండ్రి

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని పలు ప్రయివేటు విద్యాసంస్థల దోపిడీకి అడ్డూ అదుపులేకుండా పోతోంది. కాళ్లలో ఓ ప్రయివేటు విద్యాసంస్థలో రాజులపాటి గాయత్రి అన్నపూర్ణ ఒకటో తరగతి, భరత్ కుమార్ రెండో తరగతి చదువుతున్నారు. పాఠశాల బదిలీ సర్టిఫికెట్ (టిసి) కోసం ఆయా విద్యార్థుల తండ్రి రాజులపాటి రాంబాబు వారం రోజుల నుంచి పాఠశాలకు తిరుగుతున్నా యాజమాన్యం పట్టించుకోలేదు. దీంతో గురువారం రాంబాబు స్కూల్ ఎదుట ఆందోళన చేపట్టారు. టిసి పొందడానికి ఎటువంటి రుసుమూ చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే రూ.వెయ్యి వసూలు చేస్తూ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రుల జేబులు గుల్లచేస్తున్నాయి. దీంతో వారు బెంబేలెత్తిపోతున్నారు. టిసికి రూ.వెయ్యి ఇవ్వాలంటూ ప్రయివేటు విద్యాసంస్థలు ఒత్తిడి చేస్తున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 12 ప్రయివేటు విద్యా సంస్థలు ఉన్నాయి. ఏలూరుపాడు, జువ్వలపాలెం, ప్రాతళ్లమెరక, కాళ్ల, పెదఅమిరం, బొండాడ గ్రామాల్లో ఉన్నాయి. భీమవరం వెళ్లి తమ పిల్లలను చదివించలేని కుటుంబాలు స్థానికంగా ప్రయివేటు స్కూళ్లల్లో చదివిస్తున్నారు. ఎంతో కష్టపడి సంపాదించినదంతా పిల్లల చదువుకే ఖర్చవుతుండడంతో పేద, మధ్యతరగతి వారు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికితోడు ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ ఉంటోంది. దాన్ని నియంత్రించడంలో విద్యాశాఖ అధికారులు విఫలమవుతున్నారు.

టిసి ఇవ్వడానికి రూ.1000 ఇవ్వాలని ఒత్తిడి

రాజులపాటి రాంబాబు, కాళ్ల

నా ఇద్దరు పిల్లలూ కాళ్లలోని ఓ ప్రయివేటు కాన్వెంట్లో 1, 2 తరగతులు చదువుతున్నారు. టిసి కోసం వారం రోజుల నుంచి తిరుగుతున్నా ఇవ్వడం లేదు. ఫీజు బకాయి రూ.3000 కూడా కట్టేశాను. టిసి ఇస్తే మరో పాఠశాలలో చేర్పిస్తా.

అలాంటి విద్యాసంస్థలపై చర్యలు తీసుకుంటాం

ఎ.రవీంద్ర, ఎంఇఒ-1, కాళ్ల

టిసిలకు డబ్బులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకుంటాం. తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకుంటాం.

ప్రజా సమస్యలే ప్రభుత్వ ఎజెండా : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రజా సమస్యలే తమ ప్రభుత్వ ప్రధాన ఎజెండా అని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని నన్నయ యూనివర్సిటీ నుంచి ఎన్హెచ్ 16 అండర్ పాస్ వరకూ, ఏరియా ఆసుపత్రి తూర్పు గేటు వరకూ, అగ్గిపెట్టెల కంపెనీ వద్ద సీసీ రోడ్ల నిర్మాణానికి గురువారం ఎంఎల్ఎ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పది వేల మంది విద్యార్థులు గణేష్నగర్ రహదారి గుండా రాకపోకలు సాగిస్తారన్నారని, వారందరి ఆకాంక్ష మేరకు ఈ రహదారిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో కొంతమంది తమ పొలాల వద్ద రహదారి నిర్మించాలని ప్రయత్నించారన్నారు. తాను మున్సిపల్ ఛైర్మన్గా ఉన్న సమయంలోనే ఈ రహదారి నిర్మాణానికి మంజూరు చేయించామని గుర్తు చేశారు. అయితే అప్పుడు జెడ్పి ఛైర్మన్గా ఉన్న ముల్లపూడి బాపిరాజు సహకారంతో రోడ్డు నిర్మించాలని ప్రయత్నించినా అప్పటికే ఎన్నికలు రావడంతో రోడ్డు నిర్మాణం నిలిచిపోయిందన్నారు. ఈ రహదారిని కొండలమ్మ ఆలయం, ఎస్వీఆర్ సర్కిల్ వరకూ అవుట్లెట్ నిర్మిస్తామన్నారు. త్వరలోనే తాడేపల్లిగూడేనికి క్రికెట్ స్టేడియం మంజూరు కాబోతోందన్నారు. టిడిపి నియోజకవర్గ ఇన్ఛార్జి వలవల బాబ్జి, బిజెపి నేత ఈతకోట తాతాజీ, శశి విద్యాసంస్థల అధినేత బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.మురళీకృష్ణ, కాళ్ల గోపి, డిప్యూటీ ఇంజినీర్, అసిస్టెంట్ ఇంజినీర్ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలలో మెరుగైన వసతుల కల్పనకు కృషి

ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - ఉండి

పాఠశాలలో మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. గురువారం ఎన్ఆర్పి అగ్రహారం గ్రామంలోని హైస్కూల్లో మౌలిక వసతులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ముందుగా మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, గ్రామ పార్టీ అధ్యక్షులు దూసనపూడి రాంబాబు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు రూత్ కళ ఆధ్వర్యంలో శివాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం హైస్కూల్ ఆవరణలో ఆయన జనసేన నియోజకవర్గ ఇన్ఛార్జి జుత్తుగ నాగరాజు, కొత్తపల్లి నాగరాజుతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ పాఠశాలలో ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. చెస్ వంటి క్రీడల్లో విద్యార్థులు పాల్గొని తమ మేధాశక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులంతా కష్టపడి చదువుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు అవసరమైన క్రీడా కిట్లను పంపిణీ చేశారు. అలాగే గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న రఘురామకృష్ణంరాజు మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ గ్రామంలోనే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్లు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శ్రీహరి నారాయణరాజు, జెడ్పిటిసి కనకదుర్గ మహంకాళి, సర్పంచి సూరవరపు కనకదుర్గ వెంకటాచార్యులు పాల్గొన్నారు.

రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు

సబ్సిడీపై బియ్యం, కందిపప్పు అందజేత

ప్రజాశక్తి - నరసాపురం

రైతుబజార్లలో సబ్సిడీపై అందిస్తున్న కందిపప్పు, బియ్యం వంటివి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. గురువారం స్థానిక రైతు బజార్లో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సబ్సిడీ ధరలకు విక్రయిస్తున్న బియ్యం, కందిపప్పు స్టాల్ను ఎంఎల్ఎ నాయకర్ ప్రారంభించి మాట్లాడారు. పేదలకు సబ్సిడీపై అందిస్తున్న బియ్యం, కందిపప్పు వంటివి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. బహిరంగ మార్కెట్లో రూ.181లకు విక్రయిస్తున్న కందిపప్పును రూ.160లకు, రూ.56లకు అందిస్తున్న బియ్యాన్ని రూ.49లకు, రూ.48లకు అందజేస్తున్నట్లు తెలిపారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నాయకర్ కోరారు. ఈ కార్యక్రమంలో టిడిజి ఇన్ఛార్జి పొత్తూరి రామరాజు, ఆర్డిఒ ఎం.అచ్యుత్ అంబరీష్, తహశీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్, ఎస్టేట్ ఆఫీసర్ అనూష పాల్గొన్నారు.

పాలకొల్లు : నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో పేదలకు బియ్యం, కందిపప్పు తక్కువ రేట్లకు అందించాలని పట్టణంలోని రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్ను ఏర్పాటు చేశారు. ఈ కౌంటర్ను మాజీ ఎంఎల్సి అంగర రామ్మోహన్రావు ప్రారంభించారు. కేజీ కందిపప్పు రూ.160, బియ్యం రూ.48, సోనామసూరి స్టీమ్ రైస్ రూ.49 రూపాయలు ప్రతి వినియోగదారుడికీ విక్రయించనున్నట్లు తెలిపారు. ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

తణుకు : ప్రజలకు తక్కువ ధరలకు నాణ్యమైన నిత్యావసర సరుకులు అందించడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లూ చేస్తోందని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద బహిరంగ మార్కెట్లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన బియ్యం, కందిపప్పు తక్కువ ధరకు అందించాలనే ఉద్దేశంతో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ బిఎం.ముక్తేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మాజీ మున్సిపల్ ఛైర్మన్ దొమ్మేటి వెంకట సుధాకర్ పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం : ప్రజలకు బియ్యం అందజేస్తున్న ఎంఎల్ఎ

తాడేపల్లిగూడెం : రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వ స్థాపనే ధ్యేయంగా పాలన సాగుతోందని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనం వద్ద గురువారం తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం, కందిపప్పు పంపిణీకి సంబంధించి ప్రత్యేక కౌంటర్ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. రాష్ట్రంలోనే తొలిగా తాడేపల్లిగూడెంలో ఈ విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. టిడిపి నియోజకవర్గ ఇన్ఛార్జి వలవల బాబ్జి మాట్లాడుతూ వ్యాపారులు ఎవరు భయపడాల్సిన పనిలేదన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు, బిజెపి కన్వీనర్ ఈతకోట తాతాజీ మాట్లాడారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.మురళీకృష్ణ, కూటమి నాయకులు నాయకులు పాల్గొన్నారు.

ఏమార్చి రూ.1.29 లక్షలు స్వాహా

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఎటిఎంలో నగదు తీయడంపై అవగాహన లేని వ్యక్తిని ఏమార్చి కార్డు దొంగిలించిన అగంతకుడు రూ.1.29 లక్షలు స్వాహా చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం. పోడూరు మండలం మినిమించిలిపాడు గ్రామానికి చెందిన కె.సతీష్ మార్టేరు పక్కన ఉన్న నెగ్గిపూడి ఎస్బిఐ ఎటిఎంలో నగదు తీయడం కోసం వచ్చి, అవగాహనలేక పక్కన ఉన్న వ్యక్తిని అడిగాడు. అతను తీస్తున్నట్లు నటించి ఆ కార్డును మార్చేశాడు. తర్వాత దఫదఫాలుగా రూ.1.29 లక్షలు డ్రా చేసినట్లు బాధితుని మొబైల్కు సమాచారం రావడంతో సతీష్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ తెలిపారు.

పార్క్ వద్ద ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - ఉండి

ఉండి, ఆకివీడు ప్రధాన రహదారిలోని కలిదిండి రామచంద్ర రాజు జన్మభూమి పార్క్ వద్ద ఆక్రమణలను గురువారం అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి కేశిరెడ్డి గోపాలకృష్ణ మాట్లాడుతూ శాసనసభ్యులు కనుమూరి రఘురామకృష్ణంరాజు ఆదేశాల మేరకు ఆక్రమణలను తొలగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

'మిషన్ శక్తి'పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పెనుగొండ

మిషన్ శక్తి పథకంపై డ్వాక్రా సంఘాలతో అవగాహనా సదస్సు నిర్వహిస్తామని ఐసిడిఎస్ అధికారి ఎం.విజయ కుమారి తెలిపారు. గురువారం వెలమల కమిటీ హాల్లో డ్వాక్రా సంఘాలతో ఆమె మాట్లాడుతూ వంద రోజులు డ్వాక్రా సంఘాలు మిషన్ శక్తి పథకంపై అవగాహన కల్పిస్తూ పరిసరాల పరిశుభ్రత, జాగ్రత్తలు, వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై తగు చర్యలు తీసుకోవాలని డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా సిసి అధికారి శేషారత్నం, అంగన్వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బహుముఖ కళాకారుడు శివలింగేశ్వరరావు

ఆకివీడు :సుమారు రెండు దశాబ్దాలుగా ఇంద్రజాల ప్రదర్శనలో పలువురి ప్రశంసలు అందుకున్న బహుముఖ కళాకారుడు శివలింగేశ్వరరావు అని వక్తలు పేర్కొన్నారు. ఇటీవల హైదరాబాద్లో మరణించిన కళాకారుడు శివలింగేశ్వరరావు సంస్మరణ సభ స్థానిక లలిత కళా సాంస్కృతిక సంస్థ సరిగమ సంగీత పరిషత్ ఆధ్వర్యంలో శాంతినగర్ నూకాలమ్మ దేవాలయ ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా పరిషత్ అధ్యక్షులు కోటేశ్వరరావు మాట్లాడుతూ రంగస్థల నటుడిగా, ప్రముఖ ఇంద్రజాలికుడిగా పేరుపొందిన శివ తమ సంస్థ సభ్యుడుగా చాలా కాలం సేవలందించారని తెలిపారు. కార్యక్రమంలో పరిషత్ సభ్యులు కొల్లి వెంకన్న బాబు, అట్లూరి రంగారావు, గుడిపాటి వెంకటేశ్వరరావు, పాలకోడేరు మిమిక్రీ కళాకారుడు వీరవల్లి రాంబాబు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - కాళ్ల

దాత ఆర్థిక సహకారంతో విద్యార్థులకు విద్యా సామగ్రి అందించడం అభినందనీయమని జువ్వలపాలెం మెయిన్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. వి.అప్పలనాయుడు అన్నారు. జువ్వలపాలెం మెయిన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి గురువారం పంపిణీ చేశారు. రూ.15 వేల విలువైన విద్యా సామగ్రిని గోకరాజు సుందరమ్మ పేరుతో ఆయన కుమారుడు టిడిపి నాయకుడు గోకరాజు విశ్వనాథరాజు (నాగరాజు) సొంత ఖర్చుతో పుస్తకాలు, పెన్నులు, బలపాలు, పెన్సిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిహెచ్ శివయ్య, ఉపాధ్యాయురాలు ఎస్ఎ బేగం, టిడిపి నాయకుడు గోకరాజు శివరామరాజు (శివ బాబు), విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎస్ఐగా సుబ్బారావుకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - ఉండి

ఉండి పోలీస్ స్టేషన్లో ఎఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న నూని నాగ సుబ్బారావుకు ఎస్ఐగా ఉద్యోగోన్నతి లభించింది. 1987 బ్యాచ్కు చెందిన సుబ్బారావు గతంలో ఏలూరు, పెరవలి, ఆకివీడు, కాళ్ల, నిడమర్రు, గణపవరం తదితర పోలీస్స్టేషన్లలో విధులు నిర్వర్తించారు. ఎస్ఐగా ఉద్యోగోన్నతి పొందిన సుబ్బారావును ఆకివీడు సిఐ కెవివిఎన్ సత్యనారాయణ, ఉండి ఎస్ఐ మందపల్లి లక్ష్మణ్, పోలీస్ స్టేషన్ సిబ్బంది అభినందించారు.

మహారాజశ్రీ కొవ్వూరు 9వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి వారి కోర్టులో

O.S. 48/2012

Between:

మద్దిపాటి శరణ శ్రీదత్త, Being Minor rep. by her Mother next friend మద్దిపాటి తులసీ వాణి -వాది

Vs

మద్దిపాటి అబ్బులు (died) వ॥లు -ప్రతివాద్లు

4వ ప్రతివాది: కంతేటి జయలక్ష్మి, W/o. గంగాధర్, డో.నెం. 1-1-107/1, జంగారెడ్డిగూడెం.

6వ ప్రతివాది: మద్దిపాటి వెంకటలక్ష్మి, W/o. late అబ్బులు, డో.నెం. 1-1-107/1, జంగారెడ్డిగూడెం.

వాయిదా: 19-7-2024

ఈ నెంబరు దావాలో 4, 6 ప్రతివాద్లు మీకు కోర్టు ద్వారా, పోస్ట్ ద్వారా దావా సమన్లు పంపించియున్నను తీసుకోకుండా Avoid చేయుచున్నందున కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం పై నెంబరు దావాలో 4 మరియు 6 ప్రతివాద్లు అయిన మీరు పై కోర్టు వారి ఎదుట **ది. 19-7-2024న ఉదయం 10.30 ని॥ల** లగాయతు స్వయముగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియచేయగలరు. అట్లు కాని పక్షమున మీ పరోక్షమున తీర్మానించబడును.

J.BHARAT CHANDRA
Advocate, Kovvur
కొవ్వూరు
ది.03-7-2024 Cell: 9440413461

గమనిక

పిల్లి సత్య శ్యామలకుమారి, W/o. త్యాగరాజు (గారి) వీరి వద్ద నుంచి Document No. 720/1999 and 6052/1997 పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు సబ డి., ఏలూరు మండలం, శనివారపుపేట గ్రామపంచాయతి, గవరవరం గ్రామంలోని ఆర్.ఎస్. నెం. 18/2ఎ దాఖలా ప్లాట్లులో నా తాలూకు ప్లాటు నెం. (2)రు దాఖలా చ॥గ॥ 246.6.0లు లేక 205.680 చ॥ ఖాళీ స్థలంకు హద్దులు.

తూర్పు: దిమ్మిట రాంప్రసాద్ గారి తాలూకు ప్లాటు నెం. 3రు స్థలం అ. 55.3లు. **దక్షిణం:** రోడ్డు అ. 40.0లు. **పడమర:** రాంజీ గారి ప్లాటు నెం. 1రు స్థలం అ. 55.3లు. **ఉత్తరం:** చిటిబొమ్మ ఆనందరావు గారి స్థలం అ. 40.6లు.

ఈ హద్దుల మధ్య చ॥గ॥ 246.6.0లు

ఈ హద్దులు గల భూమి మేము కొనుగోలుచున్నాము. ఇందులో ఎవరికి అయిన అభ్యంతరం ఉంటే తెలియజేయ కోరుచున్నాము.

ఇట్లు: బి.ఎన్.సురేష్
ఏలూరు, సెల్: 9676663830

మహారాజశ్రీ సివిల్ జడ్జి కోర్టు (సీనియర్ డివిజన్), తాడేపల్లిగూడెం

HMOP.No.28/2024

బిట్వీన్ :

సంకు వెంకట సత్యనారాయణ కొండ ...పిటీషనరు

మరియు

సంకు సత్యవాణి ...రెస్పాండెంట్

పిటిషనరు దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల పిటిషన్లో రెస్పాండెంట్ అయిన సంకు సత్యవాణి భర్త వెంకట సత్యనారాయణ కొండ, గుబ్బల వారి వీధి, ఆర్.ఆర్.పేట, ఏలూరు వారికి పైకోర్టులో **ది.23-7-2024వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా కాని హాజరు అయ్యి తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవలెను. లేనియెడల సదరు పిటిషను తమ పరోక్షమున విచారణ చేయుదురని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

నిమ్మల రాము
తాడేపల్లిగూడెం అడ్వకేట్, ఏలూరు.
ది.8-7-24 సెల్: 9448312444

పాస్పోర్టు పోయినది

ANUMALASETTY VENKATA SUNIL KUMAR అను నాకు విశాఖపట్నం పాస్పోర్టు కార్యాలయం అధికారులు ది.25-11-2010న J3952507 నెంబరు గల పాస్పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్పోర్టు జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు మా ఇంటి నుండి నరసాపురం పట్టణం మెయిన్రోడ్కు వెళ్తుండగా నా ఒరిజినల్ పాస్పోర్టు పోయినది. గాన నా పాస్పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

ANUMALASETTY VENKATA SUNIL KUMAR
S/o. Anumalasetty Venkata Venkateswarlu
D.No.2-2/1-76, 2nd Ward, Chalava Peta
Narasapur-534275

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, ఏలూరు

I.A. No. 429/2023
FDIA No. 1945/2008
O.S. No. 7/1993

బిట్వీన్:

కొసరాజు వీర వెంకట వరప్రసాద్ -పిటీషనర్/వాది

మరియు

కొసరాజు వెంకట నారాయణ (died) వగయిరాలు -రెస్పాండెంట్లు

పిటీషనరు/వాది దాఖలు చేసిన పబ్లికేషన్

పై నంబరు గల పిటీషన్లో 9వ రెస్పాండెంటు మందలపు హరిత, D/o. లేటు పెద సుబ్బయ్య, ఫ్లాటు నెం. 20, శ్రేయ అపార్ట్మెంటు, కె.కె. టవర్స్, సత్రంపాడు, ఏలూరు, ఏలూరు జిల్లా వారికి **ది. 05-8-2024 తేది ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టులో స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవచ్చును. లేని ఎడల సదరు పిటీషన్ ఏకపక్షముగా తీర్మానం చేయుదురని యిందుమూలముగా తెలియచేయడమైనది.

ఆవుల జగన్మోహనరావు
పుప్పాల రామకృష్ణ
అడ్వకేట్స్, శ్రీరామ నివాస్
ఏలూరు అశోక్నగర్, ఏలూరు
ది.11-7-2024 ఏలూరు జిల్లా

నోటీసు ప్రకటన

మహారాజశ్రీ సివిలు జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం, ప॥గో॥జిల్లా

ఐ.పి. నెం. 17/2021

బిట్వీన్:

పిటీషనరు: శిద్దాని జగదీశ్వరరావు, తండ్రి: కోటి వీరభద్రం, వయస్సు 61 సం॥లు, డోర్ నెం. 54-19-7, ఎ.పి.హెచ్.బి. కాలనీ, 3వ వీధి, MIG-71, పాలకొల్లు, పాలకొల్లు మండలం, ప॥గో॥జిల్లా.

వెర్సెస్

రెస్పాండెంట్లు:

1) శ్రీమతి శిద్దాని కోటి శివశంకర పార్వతి, భర్త: జ్ఞాన కోటేశ్వరరావు, వయస్సు 54 సం॥లు, డోర్ నెం. 4-86/1, భగ్గేశ్వరం, పాలకొల్లు మండలం, ప॥గో॥జిల్లా.

2) శిద్దాని జ్యోతిర్మయి, భర్త: విశ్వనాథం కోటి అనిల్కుమార్, వయస్సు 31 సం॥లు, డోర్ నెం. 9-2-28/1, వనువులమ్మ గుడి వీధి, చర్చి రోడ్, నరసాపురం, నరసాపురం మండలం, ప॥గో॥జిల్లా.

3) ది అఫీషియల్ రిసీవర్, పశ్చిగోదావరి జిల్లా, జిల్లా కోర్టు కాంప్లెక్స్, ఏలూరు.

టు: ***2వ రెస్పాండెంట్:***

శిద్దాని జ్యోతిర్మయి, భర్త: విశ్వనాథం కోటి అనిల్కుమార్, వయస్సు 31 సం॥లు, డోర్ నెం. 9-2-28/1, వనువులమ్మ గుడి వీధి, చర్చి రోడ్, నరసాపురం, నరసాపురం మండలం, ప॥గో॥జిల్లా.

పై నెంబరు ఇన్సాల్వెన్సీ పిటీషనులో 2వ రెస్పాండెంట్ అయిన మీకు కోర్టు వారి ద్వారా అనేక పర్యాయములు నోటీసులు పంపించి నప్పటికిన్నీ, మీరు ఉద్దేశ్యపూర్వకముగా తీసుకోకుండా కాలయాపన చేసే ఉద్దేశ్యముతో ఉన్నందున ఈ ప్రకటన ద్వారా 2వ రెస్పాండెంట్ అయిన మీకు తెలియజేయునది ఏమనగా, పై నెంబరు పిటీషనులో మీ యొక్క హాజరు నిమిత్తము **ది. 30-07-2024వ తేదీకి** శ్రీ కోర్టు వారు వాయిదా వేసిన కారణముగా ఆ తేదీన శ్రీ కోర్టు వారి ముందు మీరు **ఉదయం 10 గంటల 30 నిమిషములకు** స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీ యొక్క అభ్యంతరములు తెలియజేసుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షమున తదుపరి గ్రంథము జరుపబడునని ఇందు మూలముగా మీకు తెలియజేయడమైనది.

యస్.కె.రామలింగేశ్వరరావు
పిటీషనరు తరపు న్యాయవాది
పాలకొల్లు, సెల్: 9849132391

వేలం ప్రకటన

మహారాజశ్రీ నూజివీడు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P.No.43/2012 in
O.S.No.198/2011

Between:

సజ్జా రామమోహనరావు (డైడ్) & 3 Others ...D.H.Rs

And

పొట్లూరి వెంకట గోపాల్ ...J.D.R

పూర్వపు కృష్ణాజిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, నూజివీడు మండలం, నూజివీడు పట్టణంలోని పూర్వపు R.S.No.450/1 కి సరియైన ప్రస్తుతపు R.S.No.450/56 లోని 2640 చ॥ గజాల ఖాళీ నివేశిన స్థలంలోని 400 చ॥గజాల ఖాళీ నివేశన స్తలం అయివుండి, పైన తెలిపిన జె.డి.ఆర్ యొక్క సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలో ఉండి, ఈ డిక్రీ బాకీ క్రింద పై కోర్టు వారిచే జప్తు కాబడి యుండి వేలం కావలసియున్న ఆస్థికి హద్దులు

తూర్పు : మునిసిపల్ రోడ్డు
దక్షిణం : జాదం నాగోజి గారి ఇళ్లు స్తలం
పడమర: జె.డి.ఆర్ యొక్క మిగతా ఇళ్ల స్తలం (అనగా పొట్లూరి వెంకట గోపాల్ గారి స్తలం)
ఉత్తరం : జె.డి.ఆర్. యొక్క మిగతా ఇళ్ల స్తలం (అనగా పొట్లూరి వెంకట గోపాల్ గారి స్తలం)
డి.హెచ్.ఆర్. విలువ : సుమారు రూ.10,00,000/-
అమీనా విలువ : రూ.12,00,000/-

మొత్తం 2640 చ॥గజాల స్తలం జప్తు చేయబడినప్పటికీ కేవలం 400 చ॥గజాలకు మాత్రమే షెడ్యూల్ను **ది.03-06-2013**న మార్పు చేసి దాఖలు చేయటమైనది. మరియు దర్మిలా సదరు ఆస్థి నోషనల్ సబ్ డివిజన్ ప్రకారం ప్రస్తుతం **R.S.No.450/56** పరిధిలో యున్నందున షెడ్యూల్ను **ది.28-2-2024న** మార్పు చేసి దాఖలు చేయటమైనది. 400 చ॥గజాల స్తలంనకు మాత్రమే వేలం జరుగును. పైన తెల్పిన ఆస్థిని శ్రీకోర్టు వారు **ది.08-08-2024 ఉదయం 10.30 ని॥ల** నుండి పైకోర్టులో బహిరంగ వేలం వేయుదురు. కావున ఆసక్తి కలవారు సదరు వేలంలో పాల్గొని సదరాస్థిని పాడుకొనవచ్చును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)

జి.శ్రీనివాసరెడ్డి
డి.హెచ్.ఆర్స్ తర్ఫు న్యాయవాది
నూజివీడు. సెల్: 9989873916